క్లుప్తంగా

వైభవంగా కుంభాభిషేకం



పూజల్లో పాల్గొన్న విజయానందరెడ్డి

గుడిపాల : మండలంలోని సీకేపల్లెలో ముత్యాలమ్మ ఆలయ జీర్ణోద్ధారణ అష్టబంధన మహా కుంభాభిషేకాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి విజయానంద రెడ్డి గురువారం హాజరయ్యారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయంలో విఘ్నేశ్వర పూజ, గోపూజ, ధనపూజ, మహాగణపతి హోమం, లక్ష్మీహోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాష్, నాయకులు సుధాకర్‌నాయుడు, కేపీ శ్రీధర్ పాల్గొన్నారు.

రోడ్లపై పేడ దిబ్బలు వేస్తే జరిమానా



కొల్లాగుంట వద్ద పేడదిబ్బల తొలగింపు

కార్వేటినగరం: రోడ్లపై పేడ దిబ్బలు వేస్తే భారీ జరిమానాలు తప్పవని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. గురువారం మండల పరిధిలోని కొల్లాగుంట వద్ద రోడ్లపై వేసిన పేడ దిబ్బలను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, ఇంటి ఆవరణ, వీధులు, రోడ్లపై పేడదిబ్బలు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దివ్య, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



బాబాకు పూజలు చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు జగనన్న కాలనీలో శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యే పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు ప్రసాద్, దేవరాజులు అభిషేకాలు, పూజలు చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి బంగారుపాళ్యానికి చెందిన సురేంద్ర దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉభయదారులకు నిర్వాహకులు బాబా చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్త రామచంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక విధానాలను ఎండగట్టాలి



సమావేశమైన ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్ : మేడేను కార్మికులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్ర తెలిపారు. గురువారం నగరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మే 1వ తేదీన కార్మిక వర్గం పండుగ వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు మేడే చరిత్ర ప్రత్యేకతను నాయకులు వివరించాలన్నారు. నగరంలోని ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు ఎర్ర తోరణాలు అలంకరించి జెండాను ఆవిష్కరించాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు నాగరాజు, కోదండయ్య, రమాదేవి, మణి, వి.సి.గోపీనాథ్ పాల్గొన్నారు.

సెలవులో బీసీ సంక్షేమ శాఖ అధికారి

చిత్తూరు కలెక్టరేట్ : గ్రూప్-1 పరీక్ష శిక్షణ నిమిత్తం జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానిబాషా సెలవుపై వెళ్లారు. ఈ మేరకు ఆయన మే 11వ తేదీ వరకు సెలవులో ఉంటారని ఆ శాఖ అధికారులు వెల్లడించారు. ఆయన సెలవు పూర్తయ్యే వరకు జిల్లాలో సీనియర్ అధికారి అయిన నగరి ఏబీసీడబ్ల్యూవో మునీంద్రయ్యకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇసుకాసురులు

చెరువులు, కాలువలు, వంకల్లో ఇసుక తోడేళ్లు తోడేస్తున్నాయి. అడిగేవారు లేరు చూసేవారు లేరు.. పట్టించుకునే వారు లేరు.. దీంతో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. కూటమి నేతలు మాఫియాగా మారి పగలు, రాత్రి తేడా లేకుండా అందినకాడికి తవ్వుకుంటున్నారు. అక్రమంగా తవ్వేస తెల్ల బంగారాన్ని రాశులు పోసుకుంటున్నారు. టిప్పర్లల్లో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు దర్జాగా దారి దోపిడీ జరుగుతోంది. పట్టించుకోవాల్సిన వ్యవస్థ ముడుపుల మత్తులో జోగుతున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

– సాక్షి టాస్క్‌ఫోర్స్

తవణంపల్లి మండలం మైనగుండ్ల పల్లి ప్రాంతంలోని బహుదా నదిలో ఇసుక తవ్వకాలు



- తవ్వేకొద్దీ అక్రమ ఇసుక
- బీఎన్ఆర్‌పేట రీచ్‌లో జోరుగా తవ్వకాలు
- పూతలపట్టులో పలుచోట్ల ఇసుక దోపిడీ
- డంప్‌లు చేసి అమ్మకాలు
- టిప్పర్లల్లో తమిళనాడు, కర్ణాటక తరలింపు
- ముడుపుల మత్తులో జోగుతున్న అధికారులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఆలస్యం చిత్తూరు మండలంలో ఇసుక చిత్తవుతోంది. పూతలపట్టులో జోరుగా తరలుతోంది. ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, కార్యకర్తలు ఇసుకను ఆదాయ వనరుగా ఎంచుకున్నారు. సరిహద్దు రాష్ట్రాలను అవకాశంగా చేసుకున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని తెల్లబంగారాన్ని నల్లధనంగా మార్చుకుంటున్నారు. పది నెలల కాలంలో లక్షణంగా లక్షాధికారులు అవుతున్నారు. అడ్డొచ్చినోళ్ల అంతు చూస్తామంటున్నారు. భయపెట్టి... అడ్డు తొలగించుకుంటున్నారు. దీంతో వారి ఇసుక అక్రమ రవాణా చిత్తూరు మండలం, పూతలపట్టు నియోజకవర్గంలో మూడు ట్రాక్టర్లు.. ఆరు టిప్పర్లుగా పరుగులు పెడుతోంది.

బీఎన్ఆర్‌పేటలో అడ్డగోలు

ప్రస్తుతం చిత్తూరు మండలంలోని బీఎన్ఆర్‌పేట రీచ్‌లో ఇసుక తోడేళ్లు చొరబడ్డాయి. కూటమి నేతలు ఉచితం అనే మాటను అందిపుచ్చుకుని అందినకాడికి దోచేస్తున్నారు. రీచ్‌లో యథేచ్ఛగా ఇసుక తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. రీచ్‌లోని ఇసుకను ట్రాక్టర్ల ద్వారా కుర్చివేడు ప్రాంతంలోని డంప్‌లకు చేరుస్తున్నారు. ఇలా రోజుకు పదుల సంఖ్యల్లో ట్రాక్టర్లు టన్నుల కొద్దీ ఇసుకను తోలుకుంటున్నాయి. డంపుల్లో రాశులు పోస్తున్నాయి. ఇందుకు ట్రాక్టర్ లోడ్‌కు రూ.800 చొప్పున్న ఇచ్చుకుంటున్నారు. ట్రాక్టర్‌కు ఇసుక పోసే కూలీలకు రూ.500 చొప్పున ఇస్తున్నారు. అయితే ఒక టిప్పర్ ఇసుక తమిళనాడులో రూ.60 వేల నుంచి ఒక లక్ష వరకు అమ్ముకుంటున్నారు. ఇలా రోజుకు పది టిప్పర్ల ఇసుక శెట్టిన్‌తాంగల్ మీదుగా తమిళనాడు సరిహద్దు దాటిస్తున్నారు. అక్కడి నుంచి పొన్నై, తిరుత్తణి మీదుగా చెన్నైకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే వెంగమాంబపురం మీదుగా రామాపురం నుంచి తమిళనాడు బోర్డర్‌లో గేటు తీసి చొరబడుతున్నారు. టన్నుల కొద్దీ అమ్మి లక్షల్లో జేబుల్లో వేసుకుంటున్నారు. ఇదంతా ఓ ప్రజాప్రతినిధి బంధువులు, వారి అనుచరులు చేస్తున్నారనే వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి.

పూతలపట్టులో.. పట్టించుకుంటే ఒట్టు

పూతలపట్టు మండలంలోని వావిల్‌తోట ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. బహిరంగంగా ఇసుక తోడేస్తున్నా అధికారులు చోద్యం చేస్తున్నారు. నామమాత్రంగా తనిఖీలు చేసి అక్రమ ఇసుక తవ్వకాలను వదిలేస్తున్నారు. దీంతో ఇసుక అక్రమ వ్యాపారం వావిల్‌తోటకు రయ్‌రయ్‌మంటున్నాయి. లారీలు, టిప్పర్ల ద్వారా రాత్రిళ్లు కర్ణాటకకు పంపుతున్నారు. తవణంపల్లి మండలం మైనగుండ్లపల్లి బహుదానది ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. జేసీబీలతో టిప్పర్లకు నింపి బెంగళూరుకు పంపుతున్నారు. అక్కడ రూ.లక్ష వరకు అమ్ముకుంటున్నారు. ఈ విషయం స్థానికపోలీసులు, అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుక దందా చేస్తున్న కూటమి నేతలపై కన్నెత్తి చూడడం లేదు. ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు.

నేడు రథోత్సవం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో శుక్రవారం రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 7 గంటలకు రథోత్సవ సేవ ప్రారంభవుతుందన్నారు. రాత్రి తోట ఉత్సవం ఉటుందని, భక్తులు పాల్గొని, స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఈశ్వరునికి సూర్య, చంద్రప్రభల సేవ



చంద్రప్రభ వాహనంపై స్వామివారు

చిత్తూరు రూరల్(కాణిపాకం): సూర్య, చంద్రప్రభ వాహనాలపై పరమేశ్వరుడు పరవశించారు. చిత్తూరు నగరంలోని శ్రీఅగస్తీశ్వర స్వామి దేవస్థానంలో గురువారం పంగుణి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలస్థానంలోని శివలింగానికి అభిషేక పూజలు చేయించారు. అనంతరం ఉత్సవమూర్తిని అలంకరించి సూర్యప్రభ వాహనంపై ఆశీనులు చేశారు. నగర వీధుల్లో ఊరేగించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయదారులకు ఆలయ మర్యాదలు చేశారు.

అర్ధగిరి ఆదాయం రూ.22.75 లక్షలు

తవణంపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానానికి షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా రూ.22.75 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ హనుమంతరావు తెలిపారు. గురువారం అర్ధగిరి క్షేత్రంలో 10 షాపులకు వేలం పాట నిర్వహించారు. వేలం పాటల్లో హెచ్చు పాట పాడిన వారికి ఏడాదికి లైసెన్స్ హక్కు కల్పించినట్లు వివరించారు. ఏడాదికి 10 షాపుల ద్వారా రూ.22,75,200 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. వేలం పాటలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, ఆలయ సిబ్బంది, వేలం పాటదారులు పాల్గొన్నారు.

రేపు పౌర్ణమి వేడుకలు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 12వ తేదీన శనివారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. ఉదయం స్వామి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తామన్నారు. అనంతరం ఆలయ మండపంలో సుదర్శన హోమం నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాముడికి గరుడ వాహన సేవ

తవణంపల్లె: మండలంలోని అరగొండ శ్రీ కోందరామస్వామి దేవస్థానంలో గురువారం రాత్రి గరుడ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో శ్రీసీతారామలక్ష్మణులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేయించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ఉభయదారుల ఆధ్వర్యంలో గరుడ వాహన సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుగంధ పరిమళ పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించిన గరుడ వాహనంపై సీతారాములు కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగారు. భక్తులు స్వామివారికి ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, హారతులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. శ్రీకోదండరామాలయంలో శుక్రవారం ఉదయం శ్రీసీతారామలక్ష్మణులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహిస్తారని కార్యనిర్వాహకులు తెలిపారు.

వేణుగోపాలుడిగా శ్రీరాముడు

చిత్తూరు రూరల్(కాణిపాకం): వేణుగోపాలుడిగా శ్రీరాముడు భక్తులను కనువిందు చేశారు. చిత్తూరు నగరం రాములవాకిగుడివీధిలోని శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవపేతంగా కొనసాగుతున్నాయి. గురువారం కూడా ఆలయంలో విశేష పూజలు, రామ నామస్మరణతో మార్మోగింది. ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారిని భక్తులు భక్తిప్రపత్తులతో దర్శించుకున్నారు. వసంతోత్సవాన్ని చేపట్టారు. వేణుగోపాలుడిగా శ్రీరాముడిని అలంకరించారు. నృత్య ప్రదర్శనలు, డప్పు వాయిద్యాల నడుమ స్వామివారు ఊరేగింపు రథంపై ఆశీనులయ్యారు. అనంతరం నగర వీధుల్లో అభయమిస్తూ..భక్తులను కటాక్షించారు. రాత్రి తోట ఉత్సవంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.



చిత్తూరు రూరల్(కాణిపాకం): వేణుగోపాలుడి అలంకరణలో శ్రీకోదండరాముడు

వన్యప్రాణుల మూగరోదన

గుడిపాల : గుడిపాల మండలంలోని గ్రామాల సమీపంలో అటవీ ప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో వన్యప్రాణులు దాహం తీర్చుకునేందుకు జనవాసాల్లోకి వస్తున్నాయి. వీటిని గ్రామాల్లో కుక్కలు వెంబడించి దాడిచేసి గాయపరచడంతో మృతి చెందుతున్నాయి. ఎక్కువగా దుప్పులు, అడవి పందులు, జింకలు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఈ ప్రాంతంలోని అడవుల్లో నీటి మడుగులు సరిగ్గా లేకపోవడంతో అడవి జంతువులు గ్రామాల వైపు దారి పడుతున్నాయి. ఇటీవల ప్రాంతంలో కట్టకిందపల్లె, చిత్తపార, బండపల్లె జింకలు తాగునీటి కోసం వచ్చి కుక్కల బారిన పడి మత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. ఇందులో భాగంగా ముత్తువాళ్లూరు గ్రామంలోకి ఓ జింక తాగునీటి కోసం ఓ ఇంటిలోకి వచ్చింది. ఇంతలో కుక్కలు వాటిని వెంబడించాయి. గ్రామస్తులు వాటిని చూసి కుక్కలను చెదరగొట్టడంతో జింక అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి అటవీ ప్రాంతాల్లో నీటి తొట్టెలు నిర్మించి ట్యాంకర్ల ద్వారా నీరు ఏర్పాటు చేసి వన్యప్రాణుల ప్రాణాలు కాపాడాలని పలువురు కోరుతున్నారు.



ముత్తువాళ్లూరులో తాగునీటికోసం వచ్చిన ఓ జింక (ఫైల్)

గంజాయి విక్రయాలపై నిఘా పెట్టాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గంజాయి విక్రయాలపై నిఘా పెట్టి కట్టడికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండల అధికారులు, పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పూర్తి స్థాయిలో నిఘా పెట్టి, కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుందామన్నారు. వన్‌టౌన్ సీఐ ఉమామహేశ్వర్‌రావు, టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య, ఎంఈఓ సెల్వరాజ్, ఎంపీడీఓ శ్రీనివాసులు ఉన్నారు.

మహిళల భద్రతకే శక్తి యాప్



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గుడిపాల : మహిళల భద్రత కోసమే శక్తియాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందని ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్ పేర్కొన్నారు. గురువారం గుడిపాల మండలంలోని లక్ష్మీనరసింహ ఫార్మసీ కళాశాల నందు విద్యార్థులకు శక్తియాప్, బాల్యవివాహాలు, అత్యవసర నంబర్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి యువతి మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో మన రక్షణకు ఉపయోగపడుతుందన్నారు. అత్యవసర సమయంలో ఎస్‌ఓఎస్ బటన్ ప్రెస్ చేయగానే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరుతుందన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నిషేధమని, ఏదైనా బాల్యవివాహం గమనించినప్పుడు వెంటనే 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, మహిళలు ఎదుర్కొనే అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు కాల్‌చేసి సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మహిళా ఎస్‌ఐ నాగసౌజన్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం





గుడిపాల : శ్రీరంగంపల్లెలో పోషణ్ పక్వాడ నిర్వహిస్తున్న కార్యకర్తలు, ఐరాలలో..

గుడిపాల : పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, తోయాద్రాక్షి అన్నారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. గురువారం శ్రీరంగంపల్లె, కిల్లారిపల్లె, పిళ్లారికుప్పం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వారు తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో పోషకాహారం తీసుకొనే వారితో పాటు, ఇంటికి తీసుకెళ్లే వారు కూడా సక్రమంగా తినేలా పర్యవేక్షించాలని సూచించారు. పోషకాహారం అందించి రక్తహీనత లేకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాణి, జ్యోతి,జమున, లక్ష్మీకాంత, ఉపాధ్యాయులు జయంతి, శ్రీదేవి, జయశ్రీ పాల్గొన్నారు.

రక్తహీనతను నివారిద్దాం

ఐరాల: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారిద్దామని సీడీపీఓ నిర్మల సిబ్బందికి సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంపై బాలింతలు, గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రక్తహీనత, కిడ్నీ వ్యాధులు, గుండె జబ్బులను రూపుమాపేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వేసవిలో ప్రతి ఒక్కరూ విధిగా నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు, సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

వృక్ష విలాపం !

చిత్తూరు అర్బన్ : కాలువ కట్టడానికి చెట్లను నరికివేశాడు ఓ కాంట్రాక్టర్. చిత్తూరు నగరంలోని రంగాచారి వీధిలో వెలుగు చూసిన ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే...చిత్తూరు నగరంలోని ఏటివార ఉన్న రంగాచారీ వీధిలో కాలువ నిర్మించడానికి కార్పొరేషన్ అధికారులు టెండర్లను పిలిచారు. ఈ టెండర్ తగ్గించుకున్న ఓ కాంట్రాక్టర్ రోడ్డుకు పక్కన 30– 40 ఏళ్ల వయసున్న చెట్లను నరికేశాడు. నరికిన చెట్లను అమ్మేసుకున్నారు. దీంతో ఆవీధి బోసిపోయి నీడను కోల్పోయింది. చల్లటి గాలిని ప్రసాదించే ఆ చెట్లు మాయం కావడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నరికేసిన చెట్లు

ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్య సేవలు



తవణంపల్లె: తెల్లగుండ్లపల్లెలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవ నారాయణ



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని తెల్లగుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 27 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఐరాల: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నాగంవాండ్ల పల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షల చేశారు. గర్భిణులు తాజా కూరగాయలు, గుడ్లు, కొబ్బరి నీరు, అధికంగా నీరు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జోరుగా క్రికెట్ బెట్టింగ్

గుడిపాల : ఐపీఎల క్రికెట్ నేపథ్యంలో చిత్తూరు నియోజకవర్గంలో గిరింపేట, కొంగారెడ్డిపల్లె, సంతపేట, రామ్‌నగర్ కాలనీ, ఎస్టేట్‌లతో పాటు గుడిపాల మండలంలో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. వినోదం కోసం నిర్వహించే క్రికెట్ పోటీలు కొందరు జూదరులకు కల్పతరువుగా మారింది. వ్యాపారం సీజన్ ఎలాగో క్రికెట్ బెట్టింగ్ కాసేవారికి ఐపీఎల్ ఒక సీజన్‌లా తయారైంది. గతంలో జనాలందరూ ఒకచోట కూర్చొని మ్యాచ్ చూస్తూ బెట్టింగ్ కాస్తూ రూ.లక్షల్లో చేతులు మారే రోజులు పోయాయి.

యాప్‌లలో పందేలు కాస్తూ..

సాంకేతికత కొత్త పుంతలు తొక్కడంతో స్మార్ట్ ఫోన్‌లోనే బెట్టింగ్ కాసేలా కొన్ని యాప్‌లు వచ్చాయి. క్రికెట్ మజా, క్రికెట్ లైవ్‌లైన్, క్రిక్‌బజ్, 10 క్రిక్ తదితర యాప్‌లు బెట్టింగ్ వేసేందుకు మరింత సులువుగా మారింది. దీంతో జూదరులు యాప్‌లతో రూ.లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నారు. రోజుకు ఒక మ్యాచ్. శని, ఆదివారాల్లో రెండు మ్యాచ్‌లు నిర్వహిస్తున్న నేపథ్యంలో జూదరులకు శని, ఆదివారాలు పండుగలా మారాయి. ఫోన్ పే, గూగుల్ పే యాప్‌లతో నగదు జమ చేసుకుంటూ ప్రశాంతంగా ఇంట్లోనే స్మార్ట్‌ఫోన్‌లో బెట్టింగ్ కాస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న వారితో యువతే ఎక్కువ మంది ఉన్నారు. ప్రతి ఒక్కరికీ స్మార్ట్‌ఫోన్ ఉండటంతో అందులో బెట్టింగ్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసి దర్జాగా బెట్టింగ్ కడుతున్నారు. శని, ఆదివారాల్లో జరిగే మ్యాచ్‌ల్లో రూ.లక్షల్లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. జూదరులను పట్టుకోవడం పోలీసులకు కష్టంగా తయారైంది. వినోదం కోసం నిర్వహించే ఐపీఎల్ మ్యాచ్‌లు యువతను మరింత చెడు దారుల్లోకి నెట్టేస్తోందని కొందరు ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మే 25 వరకు ఇదే తీరు

మార్చి 22 నుంచి ప్రారంభమైన మ్యాచ్‌లు మేనెల 25వ తేదీ వరకు ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ఉన్నాయి. అప్పటి వరకు యువత బెట్టింగ్‌లో మునిగి తేలనుంది. బాల్‌బాల్‌కు కూడా బెట్టింగ్‌లను కడుతున్నారు. క్రికెట్ ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఇదే తరహాలో ఉన్నారు. కొంత మంది ఉద్యోగులు కార్యాలయాల్లో కూర్చొని మరుసటి రోజు జరిగే మ్యాచ్‌లపై ముందుగానే బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఇందుకోసం ముందస్తుగా కొంత నగదును అడ్వాన్స్ రూపంలో ఇస్తున్నారు. టీ దుకాణాలు, హోటల్‌ల వద్ద కూడా ఐపీఎల్ మ్యాచ్‌లపైనే చర్చలు సాగుతున్నాయి.